క్లుప్తంగా

వీఆర్వోస్ సంఘ అధ్యక్షుడిగా సూరిబాబు



కోటనందూరు: వీఆర్వోస్ సంఘ మండలాధ్యక్షుడిగా కేఈ చిన్నయ్యపాలెం వీఆర్వోస్ వేగి సూర్యనారాయణ (సూరిబాబు) ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘ అధ్యక్షుడిగా సూరిబాబు, ఉపాధ్యక్షుడిగా కోటనందూరు-2 వీఆర్వోస్ శివరామకృష్ణ, కార్యదర్శిగా ఎస్సార్‌పేట వీఆర్వోస్ రాజాశంకర్, కోశాధికారిగా బొద్దవరం వీఆర్వోస్ ఉదయ కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీపీ లగుడు శ్రీనివాసు, తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యం, సహచర వీఆర్వోస్‌లు అభినందించారు.

నిత్యావసరాల పంపిణీ



వీరవరంలో నిరుపేదలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న జాన్ కుమార్

కిర్లంపూడి: మండలంలోని వీరవరంలో నిరుపేద కుటుంబాలకు శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. స్థానిక లవ్ ఇన్ యాక్షన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ఉందుర్తి జాన్ కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఒక్కో కుటుంబానికి 26 కేజీల బియ్యం, 2 కేజీల కందిపప్పు, 2 కేజీల వంట నూనె, రెండు దుప్పట్లు, రెండు చీరలు, కిచెన్ సెట్ పంపిణీ చేశారు. లవ్ ఇన్ యాక్షన్ మినిస్ట్రీస్ సంస్థను స్థాపించిన దగ్గర నుంచి నిరుపేద కుటుంబాలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జాన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో లవ్ ఇన్ యాక్షన్ మినిస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ దైలాపల్లి మేరీ పాల్గొన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ మీట్



క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై సతీష్

ఏలేశ్వరం: స్థానిక భాష్యం స్కూల్‌లో నిర్వహిస్తున్న ఇంట్రా స్పోర్ట్స్ మీట్ శనివారంతో ముగిసింది. రెండోరోజు మీట్‌లో బాలికలకు వివిధ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని తుని, సామర్లకోట, పిఠాపురం, జగ్గంపేట, ఏలేశ్వరం బ్రాంచీలకు చెందిన బాలికలకు ప్రిన్సిపాల్ గొల్లపల్లి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఖోఖో, కబడ్డీ, షటిల్, వాలీబాల్, క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్సై జిసతీష్ బహుమతులు అందజేశారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి



తంటికొండ వెంకన్న ఆలయంలో అన్నదానం

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పంచ హారతులు సమర్పించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్వామి వారిని సుమారు 1200 మంది భక్తులు దర్శించుకోగా, 206 మంది తలనీలాలు సమర్పించారని దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



కొంతంగిలో బాధిత కుటుంబానికి సామగ్రి అందజేస్తున్న నాసా స్వచ్ఛంద సంస్థ సభ్యులు

శంఖవరం: మండలంలోని కొంతంగిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గుమ్మిడి శ్రీను కుటుంబానికి నాసా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చేయూతను అందించారు. బాధితులకు నిత్యావసరాలు, బియ్యం,కిరణా సామగ్రి, రగ్గులు, చాపలు, దుప్పట్లు, దుస్తులు, నగదు అందజేశారు. నాసా డెవలప్‌మెంట్ ఆఫ్ డైరెక్టర్ ఎన్. సుజిత్, హేమలత, వి.దొంగబాబు పాల్గొన్నారు.

దశాబ్దాల కల.. సాకారమయ్యే వేళ

- తుని మెయిన్ రోడ్డు విస్తరణకు చర్యలు
- రూ.52 కోట్ల నిధుల మంజూరు
- బాధితులకు రూ.40 కోట్ల మేర నష్టపరిహారం



విస్తరణకు ప్రతిపాదించిన తుని మెయిన్ రోడ్డు

తుని: పట్టణ ప్రజల దశాబ్దాల కల సాకారమవుతోంది. ఇరుకు రోడ్డుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవ తీసుకుని రహదారి విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించారు. ఇప్పటికే పలు మార్లు రోడ్లు, భవనాలు, పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు వ్యాపారులతో సమావేశాలు నిర్వహించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సహకరించాలని కోరారు. కొంత మంది నష్ట పరిహారం విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ మంత్రి రాజా మాత్రం మెయిన్ విస్తరణ చేసి తీరుతామని శుక్రవారం తునిలో జరిగిన గృహ సారథుల సమావేశంలో స్పష్టం చేశారు. ఇప్పటికే రోడ్డు విస్తరణకు సంబంధించిన నిధులు రూ.52 కోట్లు మంజూరు చేయాలని డీపీఆర్‌ను ప్రభుత్వానికి సమర్పించారు. రెండు నెలల్లో పనులు ప్రారంభించాలని అధికారులను మంత్రి రాజా ఆదేశించారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం

పురపాలక సంఘం మాస్టర్ ప్లాన్ ప్రకారం విస్తరణ పనులు చేపట్టనున్నారు. గొల్ల అప్పారావు సెంటర్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు మాస్టర్ ప్లాన్‌లో 60 అడుగులు రోడ్డుగా ఉంది. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సెంటర్ నుంచి వీరవరపు పేట వరకు మరో 40 అడుగులు ఉంది. దీని ప్రకారం రోడ్డు విస్తరణ చేయనున్నారు. గొల్ల అప్పారావు సెంటర్ నుంచి తలుపులమ్మ తల్లి గుడి వరకూ ప్రస్తుతం 60 అడుగులు వెడల్పు ఉంది. సారా కొట్టు సందు నుంచి మసీదు సెంటర్ వరకు 10 నుంచి 15 అడుగుల మేర స్థల సేకరణ చేయాల్సి ఉంటుంది. బాధితులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లిస్తారు. ఇక జిల్లా పరిషత్ బాలికోన్నత సెంటర్ నుంచి వీరవరపుపేట వరకు ఎక్కువ కట్టడాలను తొలగించాల్సి ఉంటుంది. వీటన్నంటికీ రూ.40 కోట్లు అవుతుందని అధికారుల అంచనా వేస్తున్నారు. రూ.12 కోట్లతో రోడ్డు, కాలువలను నిర్మించనున్నారు.

మూడు నెలల్లో పనులు పూర్తి



మెయిన్ రోడ్డు విస్తరణకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తాం. టెండర్లు పిలిచి రెండు, మూడు నెలల్లో పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. విస్తరణలో సేకరించే భవనాలు, స్థలాలకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లిస్తారు. ఇది పట్టణానికి సంబంధించిన ప్రధాన సమస్య. మన పట్టణాన్ని మనమే అభివృద్ధి చేసుకోవాలంటే విశాలమైన రహదారులు ఉండాలి. కొందరికి నష్టం కలిగినా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు, వ్యాపారులు సహకరించాలి.

–దాడిశెట్టి రాజా, ఆర్‌అండ్‌బీ మంత్రి, తుని

విస్తరిస్తే ప్రజలకు మేలు



తుని పట్టణం కుడా పరిధిలో ఉండడంతో తీర ప్రాంతంలో పలు పారిశ్రామిక సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాయి. వ్యాపార లావాదేవీలకు తుని పట్టణంలో ప్రధాన కేంద్రంగా మారింది. జనాభా, వాహనాల సంఖ్య భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశం ఉంది. మెయిన్ రోడ్డును విస్తరిస్తే ప్రజలకు ఎంతో మేలు కలుగుతుంది. రోడ్డు విస్తరణ పనులకు అందరూ సహకరించాలి.

– కుసుమంచి సుబ్బరాయులు,
చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, తుని

అభివృద్ధి పనులకు సహకరించాలి

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



ఏలేశ్వరంలో రహదారి విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ కోరారు. పట్టణంలోని రహదారుల విస్తరణ పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. స్థానిక లింగంపర్తి రోడ్డు, నర్సీపట్నం రోడ్డు, యర్రవరం రోడ్డు, పాతఅడ్డతీగల రోడ్డులను ఆనుకుని రూ.2 కోట్లతో డ్రైన్లు నిర్మించనున్నారు. దీని నిమిత్తం రహదారులను విస్తరిస్తున్నారు. ఈ పనులను వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో భాగంగా రహదారులకు ఇరువైపులా డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. డ్రైన్ల నిర్మాణంతో ప్రజల ఇబ్బందులు తీరతాయన్నారు. వీటి నిమిత్తం రోడ్లను విస్తరిస్తున్నారని, దుకాణదారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. తొలుత స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవిందు, బొదిరెడ్డి గోపి, తొండారపు రాంబాబు, సుంకర రాంబాబు, దిలబర్‌హుస్సేన్, యండగండి నాగబాబు, మసిరపు నాగేశ్వరరావు, కోనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



రత్నగిరిపై స్వామి, అమ్మవారిని తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా జగిగింది. ఆలయ పండితులు ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వందలాది మంది భక్తుల నడుమ ఆలయప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేర్చారు. వేదపండితులు యనమండ్ర శర్మ, చిట్టి శివ ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, రమేష్ ఘనాపాఠి, సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మాఘపౌర్ణిమ పూజలకు ఏర్పాట్లు

మాఘపౌర్ణిమ సందర్భంగా ఆదివారం రత్నగిరిపై భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉండడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తి తెలిపారు. సాధ్యమైనంత వరకు భక్తులకు వసతి గదులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వసతి గదులు లభించని వారు విశ్రాంతి మండపాల్లో సేద తీరి స్వామివారి దర్శనం చేసువాలని కోరారు. వ్రతాలు, స్వామివారి దర్శనాలను తెల్లవారుజాము నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ధర్మవరంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు సమన్వయంతో కష్టించి పనిచేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పిలుపు నిచ్చారు. మండలంలోని ధర్మవరంలో వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో 92,700 కుటుంబాలు ఉంటే తమ ప్రభుత్వంలో నేరుగా 79 వేల కుటుంబాలకు సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరిందన్నారు. అధికారం చేపట్టిన మూడున్నరేళ్ల కాలంగానే తమ ప్రభుత్వం 95 శాతం ఎన్నికల హామీలన అమలు చేసిందన్నారు. రాష్ట్రంలో 90 శాతం ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతుంటే చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎంత దుష్ప్రచారం చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లోనూ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు, పార్టీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జిల్లా వ్యవసాయ సలహా మండల సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, జిల్లా నగర అభివృద్ధి సంక్షేమం సంఘం సభ్యుడు అనకాపల్లి సూకరాజు, సొసైటీ చైర్మన్లు కొప్పన గంగారావు, గొంతిన సురేష్, సర్పంచులు రొంగల నాగేశ్వరరావు, గొనగాల అప్పలరాజు, నడిగట్ల శ్రీమూర్తులు, దొడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

గోకవరం: జగ్గంపేట నియోజకవర్గంలో ఈ నెల 15న జరిగే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. గోకవరంలో శనివారం ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి వాహనంపై రోడ్డు మార్గాన మండలంలోని గుమ్మళ్లదొడ్డి మీదుగా గోకవరం చేరుకుని స్థానిక ఠాణా సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం జగ్గంపేటలో బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంగరౌతు రామకృష్ణ, పాలూరి బోసుబాబు, కన్నబాబు, అడపా భరత్‌బాబు, గునిపే భరత్ తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి చురుగ్గా ఏర్పాట్లు

ఏలేశ్వరం: మహాశివరాత్రి ఉత్సవాలకు స్థానిక ఏలేరు నది వద్ద ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. మహా శివరాత్రికి స్థానిక బ్రహ్మణరేవు వద్ద వేలాది మంది భక్తులు స్నానమాచరిస్తారు. దీంతో నగర పంచాయతీ ఆధ్వర్యంలో బ్రహ్మణ రేవును అభివృద్ధి చేస్తున్నారు. రేవు వద్ద శనివారం వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 18న మహాశివ రాత్రి కావడంతో ఏర్పాట్లను ముమ్మరం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేగల వెంకటరమణ, అలమండ వీరరాఘవస్వామి, పైల శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



వేలంకలో జగనన్న కాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

కిర్లంపూడి: జగనన్న కాలనీల్లో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి దుర్గా ప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని వేలంక జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను శనివారం ఎంపీడీఓ బి.సతీష్‌బాబు, హౌసింగ్ ఏఈ జీవీవీ సత్యనారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంకలో 122 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా 57 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. మిగిలిన వారు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు తక్కువ ధరకు సిమెంట్, స్టీల్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. దీంతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కాలనీలో వాటర్ సదుపాయం కల్పించాలని లబ్ధిదారులు కోరాగా సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. పంచాయితీ సెక్రటరీ రామిశెట్టి వీర్రాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వలంటీర్లు పాల్గొన్నారు.

7న గృహసారథులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: స్థానిక మదర్ కళాశాల ఆవరణలో ఈ నెల 7న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు జరిగే శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణ తరగతుల్లో మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అతిథుగా పాల్గొని కన్వీనర్లు, గృహసారథులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో పాటు గ్రామ వలంటీర్లు శిక్షణ తరగతులకు హాజరయ్యేలా బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహా సభలను విజయవంతం చేయాలి



తునిలో ర్యాలీ చేస్తున్న లిబరేషన్ శ్రేణులు

తుని: బీహార్‌లోని పాట్నాలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకూ జరిగే సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ 11వ జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్ కోరారు. ఈ మేరకు శనివారం సీపీఐ(ఎంఎల్) ప్రతినిధులు స్థానిక గొల్లప్పారావు సెంటర్ నుంచి తుని పట్టణం, రూరల్, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం, తొండంగి మండలాల మీదుగా బైకు రాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ఈ నెల 15న పాట్నాలో 'సేవ్ ఇండియా-సేవ్ డెమొక్రసీ' పేరుతో నిర్వహించే ర్యాలీ, భారీ బహిరంగ సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశానికే ప్రమాదకారిగా మారిన ప్రధాని మోదీని, బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు ఏకం కావాలన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో పేదలకు ఉపయోగకరం కాదు

రౌతులపూడి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు ఉపయోగకరంగా లేదని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు అన్నారు. లిబరేషన్ 11వ జాతీయ మహసభలను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



ప్రత్తిపాడు జాతీయ రహదారిపై హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ కిషోర్‌బాబు

ప్రత్తిపాడు: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ప్రత్తిపాడు సీఐ కె. కిషోర్‌బాబు సూచించారు. స్థానిక జాతీయ రహదారిపై పాదాలమ్మ తల్లి ఆలయ సమీపంలో శనివారం హెల్మెట్ ధారణపై ఎస్సై కె.సుధాకర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు బలమైన గాయాలై మరణాలు సంభవించాయన్నారు. హెల్మెట్ లేకుండా దిచక్రవాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా ప్రయనిస్తున్న వాహనచోదకులకు హెల్మెట్ ధారణ అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌సీ రాయుడు, హైవే మొబైల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్ డ్రైవర్‌పై కేసు నమోదు

ఇయర్ ఫోన్స్‌తో నిర్లక్ష్యంగా బస్ నడుపుతున్న డ్రైవర్‌పై ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు కేసు నమోదు చేశారు. స్థానిక పాదాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద సీఐ కిషోర్‌బాబు హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తుండగా అత్యంత వేగంగా రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ప్రైవేటు బస్‌ను నిలుపుదల చేశారు. డ్రైవర్ ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని, నిర్లక్ష్యంగా బస్‌ను నడపడాన్ని ఆయన గుర్తించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాహన తనిఖీ చేపట్టారు.

హెల్మెట్ ధారణ అందరి బాధ్యత

కోటనందూరు: హెల్మెట్ ధారణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక ఎస్సై పీవీసీ స్వామినాయుడు ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీసు స్టేషన్ నుంచి బస్టాండు సెంటర్ వరకూ హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిళ్లు దగ్ధం



జి.కొత్తపల్లిలో కాలిపోయిన తాటాకిల్లు

శంఖవరం: మండలంలో జి.కొత్తపల్లిలో షార్ట్ సర్క్యూట్‌తో శనివారం రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు అధికారులు అంచనా వేశారు. వివరాల్లోకి వెళితే..జి.కొత్తపల్లిలో పెద్దాడ చంటమ్మ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ అయ్యి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గాలికి మంటలు వ్యాప్తి చెంది చంటమ్మ ఇంటిని ఆనుకుని ఉన్న నురుకుర్తి నాగలక్ష్మి ఇంటికి అంటుకున్నాయి. రెండు ఇళ్లలోనూ గృహోపకరణాలతో పాటు విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైంది. గ్రామ సర్పంచ్ ఈగల విజయదుర్గ, వైఎస్ ఎంపీపీ ఈగల అప్పారావు, వీఆర్వోస్ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలకు తక్షణ సహాయ నిమిత్తం ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం అందజేశారు. ప్రభుత్వం ద్వారా బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం

బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్‌జీ



బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తుని రూరల్: రాష్ట్రంలో 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి సత్తా చాటుతుందని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జీ అన్నారు. ఎస్.అన్నవరం శివారు గెడ్లబీడు వద్ద సాయి వేదికలో శనివారం బీజేపీ కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని, అందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఏపీకి వరాల జల్లు కురిపించిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్ అన్నారు. అమృత్ భారత్ పథకంలో రాష్ట్రంలో 72 రైల్వే స్టేషన్లను ప్రపంచస్థాయి స్టేషన్లగా అభివృద్ధి చేయనున్నటుట్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ, ఉపాధ్యాక్షురాలు రేలంగి శ్రీదేవి, మేధావుల విభాగం కన్వీనర్ ముత్త నవీన్ కృష్ణ, బిల్డింగ్ కమిటీ కన్వీనర్ గటి సత్యనారాయణ, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, కార్యవర్గ సభ్యుడు తోట సర్వారాయుడు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

దిశ, పోక్సో చట్టాలపై అవగాహన



విద్యార్థులకు దిశ, పోక్సో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివనాగబాబు

గోకవరం: దిశ, పోక్సో చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గోకవరం ఎస్సై యువి శివనాగబాబు సూచించారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం హెచ్‌ఎం సీహెచ్ ఉషారాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు సామాజిక సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై శివనాగబాబు విద్యార్థులకు దిశ, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ పి.చిన్ని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

గండేపల్లి: మురారి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను కాకినాడ జిల్లా డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి సుధారాణి శనివారం పరిశీలించారు. అనంతరం మురారి సచివాలయంలో అధికారులతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి సామూహిక గృహప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలన్నారు.

ఆమె వెంట ఎంపీడీఓ రామన్, హౌసింగ్ ఏఈ రాంబాబు, పీఆర్ జేఈ శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శి పి.వీర శిరీష, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు



చిల్లంగిలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కిర్లంపూడి: వరి, మొక్కజొన్న పంటల్లో కాండం తొలుచు పురుగు నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని పెద్దాపురం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చల్లా వెంకట నరసింహరావు రైతులకు సూచించారు. మండలంలోని చిల్లంగి, జగపతినగరం గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలను శనివారం ఏఓ జోకా అమృతతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది దాళ్వా వరి నాట్లు ఆలస్యంగా వేయడంతో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంట ఎదుగుదల క్షీణించిందన్నారు. పంటను కాండం తొలుచు పురుగు ఆశించి తీవ్ర నష్టం చేకూరుస్తోందన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఎసిఫెట్ 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.